# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న మంత్రివర్గ సమావేశం రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చిస్తోంది.**
2. **విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద మిగిలిన రెండు పడవల వెలికితీత కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది.**
3. **ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు డి. ప్రసాద రావు పిలుపు నిచ్చారు.**
4. **రాష్ట్రంలో వంట నూనెల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్..., ఎన్ ఫోర్స్ మెంట్ శాఖ వ్యాపారులను హెచ్చరించింది.**
5. **నైరుతీ ఋతుపవనాలు మందగించడంతో రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.**
6. **నీటి వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ రోజు నీటి పర్యవేక్షణా దినోత్సవం జరుగుతోంది.**

==========================

ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో ఈ రోజు రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగుతోంది. రాష్ట్రంలో అవలంబించవలసిన నూతన మద్యం విధానం, విజయవాడలో బుడమేరుకు వరద ...., బాధితులకు చేపడుతున్న సహాయ చర్యలు ...., రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థ ..., పలు శాఖలలో ఉద్యోగాల భర్తీ, పరిశ్రమలకు భూముల కేటాయింపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 33 శాతం రిజర్వేషన్లు ... ఇసుక విధానం తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశం చర్చిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

-------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద చిక్కుకున్న మూడు పడవలలో ఒక దానిని నిన్న విజయవంతంగా ఒడ్డుకు చేర్చిన సాంకేతిక నిపుణులు... మిగతా రెండు పడవలనూ వెలికి తీసేందుకు ఈ రోజు ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఒడ్డుకు చేర్చిన పడవ దాదాపు 40 టన్నుల బరువుంది. రెండు పడవలను ఇనుప గడ్డర్లతో అనుసంధానించి .... వీటికి అదనంగా మరొక రెండు భారీ పడవలను అనుసంధానించి లాగడం ద్వారా బ్యారేజ్ గేటు నుండి ఒక పడవను తొలగించారు. బయటకు తీసుకు వచ్చిన ఈ పడవను పున్నమి ఘాట్ వద్ద ఉంచారు.

మిగిలిన రెండు పడవలను వెలికి తీయడానికి ఈరోజు తిరిగి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పడవల వెలికితీత కార్యక్రమాన్ని పరిశీలించారు.

---------------------------

ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు డి. ప్రసాద రావు ప్రజలకు పిలుపు నిచ్చారు. “ఏక్ పేడ్ మా కె నామ్”– అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా యాదమరి మండలం మహాసముద్రం గ్రామంలో జరుగుతున్న మొక్కల పెంపకం కార్యక్రమంలో ఆయన ఈ రోజు ముఖ్య అతిథిగా పాల్గొని ఒక మొక్కను నాటారు. పచ్చదనం పెంపొందేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం... ప్రసాదరావు పాత్రికేయులతో మాట్లాడుతూ... మానవ మనుగడకు అవసరమైన మొక్కల. పెంపకాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఎన్.డి.ఎ. శాసన సభా పక్ష సమావేశం ఈ రోజు సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరిలో జరగనున్నది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ..., ఉప ముఖ్యమంత్రి ...., జన సేన పార్టీ అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, ఎన్. డి. ఎ. కూటమికి చెందిన పలువురు నాయకులు, రాష్ట్ర మంత్రులు ...., శాసన సభ్యులు ఈ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సమావేశం జరుగుతోంది. కూటమి శాసన సభ్యుల పనితీరు ..., భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఈ సందర్భంగా చంద్ర బాబు నాయుడు దిశా నిర్దేశం చేయనున్నట్టు కూటమి వర్గాలు తెలిపాయి.

---------------------------

రాష్ట్రంలో వంట నూనెలు, ఇతర నూనెల కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ సంబంధిత నూనె వ్యాపారులను హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనె మిల్లులు, టోకు రిటైల్ దుకాణాలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారని, సామాన్యులపై భారం మోపేలా ధరలు పెంచితే ఉపేక్షించబోమని హరీష్ కుమార్ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఫించన్ పంపిణీ మార్గదర్శకాల్లో ప్రభుత్వం పలు సవరణలు చేసింది. అనగా..అంటే .... ఒకటవ తేదీన సెలవు దినం అయిన పక్షంలో అంతకు ముందు రోజే లబ్ధిదారుల ఇళ్ళ వద్దకు వెళ్లి ఫించన్‌లు అందించాలని పేర్కొంటూ జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇక నుండి అధికారులు ఇదే విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేసింది. ఫించన్ పంపిణీ ప్రారంభించిన రోజునే దాదాపు వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని కూడా సూచించింది. ఒకటవ తేదీ సెలవుగా వున్న నెలలో రెండవ తేదీన మిగతా ఫించన్ లు పంపిణీ చేయాలని, రెండవ తేదీన సెలవు దినం అయితే ఆ మరుసటి రోజు మూడవ తేదీన అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

---------------------------

రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ ..., ప్రధాన మంత్రి జన్ మన్ పథకాల కింద చేపడుతున్న

పేదల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 331 కోట్ల రూపాయల విడుదలకు పాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను సంబంధిత నోడల్ ఖాతాలో జమ చేయనున్నారు.

మరొక వైపు .... ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పట్టణ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాన్ని జియో ట్యాగింగ్ చేసేందుకు 4 కోట్ల 94 లక్షల రూపాయల మేర నిధులను విడుదల చేస్తూ గృహ నిర్మాణ శాఖ మరొక ఉత్తర్వు కూడా జారీ చేసింది..

---------------------------

రాష్ట్రంలో రెండు వారాల క్రితం భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండలతో సతమతమవుతున్నారు. ఎండలకు తోడు ఉక్కపోత వాతావరణం కూడా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. నైరుతీ గాలులు పూర్తిగా పొడిగా మారడం, మేఘాలు లేకపోవడం కూడా ఎండల తీవ్రతకు కారణంగా వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని కావలి పట్టణంలో నిన్న 40.1 డిగ్రీల గరిష్ట స్థాయికి ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

---------------------------

చిత్తూరు జిల్లా కానిపాకం వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న రాత్రి స్వామి వారిని నంది వాహనంపై ఊరేగించారు. ఈ రోజు ఉదయం ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం కాగా ..., స్వామి వారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాన్ని నిర్వహించారు. ఈ రోజు రాత్రి రావణ బ్రహ్మ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆర్జిత సేవా టిక్కెట్లకు సంబంధించిన డిసెంబర్ నెల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి ఈ రోజు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ తదితర సేవా టికెట్లను ఈ నెల 21 వ తేదీ ఉదయం ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు టి.టి.డి. ఒక ప్రకటనలో తెలిపింది. అదే విధంగా .... డిసెంబర్ నెలకు సంబంధించిన అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను ఈ నెల 21వ తేదీన విడుదల చేయనున్నది..

---------------------------

ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా నీటి వనరులను పరిరక్షించి, నీటిని స్వచ్ఛంగా ఉంచుకుంటూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అవగాహన కల్పించే లక్ష్యంతో 2003 నుండి ప్రతి ఏటా సెప్టెంబర్ 18వ తేదీన ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నీటి కొరతను అధిగమించి 2030 కల్లా అందరికీ త్రాగు, పారిశుధ్య అవసరాలకు నీటిని అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఈ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే

"మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. "జాతీయ పోషకాహార మిషన్" అని కూడా పిలిచే ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 18వ తేదీన ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 30వ తేదీ వరకు పలు కార్యక్రమాలు కొనసాగుతాయి. రక్తహీనత పెరుగుదల, పర్యవేక్షణ, పోషకాహారం వంటి అంశాలతో పోషన్ భీ -పడాయి భీ అనే నినాదంతో ఈ సంవత్సరం కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

========================